## ఉపసంహారం -

ఈ కథకి అసలు ముగింపు సరిగ్గా మూడు నెలల తరువాత జరిగింది!

ట్రాఫికింగ్ ఆఫ్ డ్రగ్స్, సెల్లింగ్ ఆఫ్ ఇన్ ఆథరైజ్డ్ ఆర్మ్స్, మర్డర్, కాన్స్పిరసీ ఫర్ మర్డర్, అన్న నేరాల క్రింద నరసింహాన్ని అరెస్టు చేశారు. పాతిక సంవత్సరాల చరిత్ర బయటపడింది.

అంత తెలివైనవాడూ చేసిన ఒకే ఒక తప్పల్లా - శారదమ్మ హత్య జరిగాక పేపర్లో ఆ విషయం ఎందుకు రాలేదని ఆలోచించకపోవటం, రంగా ఆ మూడు నెలలూ తనని కలుసుకోకుండా ఎందుకు వుండిపోయాడన్న అనుమానం రాకపోవటం.

సి.బి.ఐ ఆఫీసరు శారదమ్మని హత్య చేసి పారిపోయాడని ప్రభుత్వం (పొరపాటుగా) అనుకోవటంవల్లనే ఈ వార్త గుప్తంగా ఉంచబడిందని అని అతడు భావించాడు. రంగా ఇప్పట్లో తనని కలుసుకోకుండా జాగ్రత్తపడటమే మంచిదని అనుకున్నాడు.

అతడికి మురళి ఒక దేముడిలా కనిపించాడు. మురళి వేసిన ప్లాను - ముఖ్యంగా హరికృష్ణ పేరుతో వచ్చినవాడిని అడ్డు తొలగించటానికీ, శారదమ్మ హత్య చేయటంలో అతని నిపుణత - అతడిమీద నమ్మకం కలిగించినయ్.

నెమ్మదిగా తన ఒక్కొక్క ఫోల్డూ అల్లుడి దగ్గర విప్పాడు.

శారదమ్మ భర్తా, తనూ కలిసి స్థాపించిన ఫ్యాక్టరీలో తను దొంగతనంగా చేస్తున్న ఆయుధాల ఉత్పత్తి విషయం తన పార్ట్నర్‌కి తెలియటం, ఆ రాత్రే అతడిని చంపడం - అన్నీ వివరంగా మురళికి  చెప్పాడు.

అన్ని సంవత్సరాల క్రితం జరిగిన హత్యకేసులో పోలీసులు తనని ఏ విధంగా ఇరికించగలరా అని అల్లుడితో ఎన్నో సుదీర్ఘ మైన రాత్రులు చర్చలు జరిపాడు. శారదమ్మ ఎలాగూ మరణించింది కాబట్టి ఇక ఈ విషయంలో ఏ సాక్ష్యమూ దొరకదని ఇద్దరూ ఒక నిర్ణయానికి వచ్చారు.

ఇక మిగిలించి హరికృష్ణ వేషంలో ఉన్న సి.బి.ఐ.  అఫీసరు, శారదమ్మల హత్య!

సి.బి.ఐ ఆఫీసర్ శవం దొరకలేదు కాబట్టి, అతడు మరణించాడన్న ప్రసక్తే రాదు. ఎవరికైనా అనుమానం వస్తే ఇక శారదమ్మ హత్య  గురించి మురళిమీద రావాలి. ఆ సమయానికి తనతో ఉన్నట్టు రామలింగం సాక్ష్యం చెపుతాడు. కాబట్టి పోలీసుల అనుమానం అంతా ఆ ఆఫీసర్ మీదకే వెళుతుంది.

వాళ్ళ అంచనా కరెక్టయింది!

మూడు నాలుగుసార్లు వచ్చిన పోలీసులు - వీరిని ప్రశ్నలతో అంతగా బాధించలేదు. తరువాత మరి రాలేదు. వారి ప్రశ్నలన్నీ హరికృష్ణ చుట్టే తిరిగాయి. ఎప్పుడో పాతిక సంవత్సరాల క్రితం జరిగిన హత్య గురించి శారదమ్మ ఇచ్చిన కంప్లైంట్ మీద - ఒక సి.బి.ఐ ఆఫీసర్ 'అవసరమైన దానికన్నా ఎక్కువ' తెలివితేటల్తో వేసిన ప్లానునీ - ఆడిన నాటకాన్నీ వాళ్ళు అంత ప్రాముఖ్యంగా తీసుకోలేదు - అన్నట్టు కనబడ్డారు.

కానీ అంతకన్నా ముఖ్యమైన విషయం గురించి వాళ్ళు చాలా ఓపిగ్గా వేచివున్నారు.

ఒక్కసారి పోలీసుల్నించి తాకిడి తగ్గిపోయాక నరసింహం, మురళి మరింత దగ్గరయ్యారు. డ్రగ్ ట్రాఫికింగ్ గురించి అల్లుడికి చెప్పారు. కొన్ని లక్షల్తో జరిగే ఈ వ్యవహారాన్ని మురళి మూడురోజులు పరిశీలించాడు.

ఆ తరువాత ఆర్మ్స్ మాన్యుఫాక్చరింగ్ ఫ్యాక్టరీ గురించి విషయం బయటకొచ్చింది. పైకి మామూలుగా కనిపించే ఆ ఫ్యాక్టరీలో తయారయ్యే వస్తువులు టెర్రరిస్టుల కార్యకలాపాలకు సాయపడేవనీ నిర్ధారణ అయ్యింది.

నరసింహంతో పాటు ఆ విధంగా ఒక పెద్ద గ్యాంగ్ బయటపడింది.

ఆ తరువాత ఒక పోలీస్ ఉన్నతాధికారి ప్రెస్‌తో మాట్లాడుతూ "తన కొడుకుని నరసింహం పెంచటంలేదని తెలుసుకున్నాక శారదమ్మ మాకు కంప్లైంట్ ఇచ్చింది. మేం దానిగురించి అంతగా పట్టించుకోలేదు. జైల్లో ఉన్న ప్రతీ ఖైదీ తనకి అన్యాయం జరిగిందని పిటీషన్ పెట్టుకోవటం మామూలే. అదిగాక అప్పటికే ఈ కేసు పది సంవత్సరాలు పాతబడింది, రంగా ఏదో కేసులో అప్పటికే జైల్లో ఉన్నాడు. వాడిని ఇంటరాగేట్ చేస్తే ఈ విషయం నిజమే అని వప్పుకుని 'అప్రూవర్'గా మారాడు. అసలప్పుడే నరసింహాన్ని బుక్ చెయ్యొచ్చు. కానీ కేసు కోర్టులో నిలబడకపోవచ్చు. రంగా ఒక్కడి సాక్ష్యం సరిపోక నరసింహం  విడుదలకావచ్చు. అందుకని మురళిని ఆయుధంగా వాడాం. హత్య కేసు బిగుసుకునే లోపులో నరసింహం మేం అనుకునే దానికన్నా ప్రమాదకరమైన వ్యక్తి అని తెలిసింది. మొత్తం పోలీస్ డిపార్టుమెంట్ అంతా మురళికి సాయం చేసింది. ఐ కంగ్రాచ్యులేట్ హిమ్" అని స్టేట్‌మెంట్ ఇచ్చాడు.

*  *  *

"రాధా, ఐయామ్ సారీ" అన్నాడు మురళి. రాధ మాట్లాడలేదు. తలవంచుకుని కూర్చుని వుంది. ఎంత కాదనుకున్నా నరసింహం తన తండ్రి.

"చివరి క్షణంలో నా దగ్గరికి వచ్చి - రైల్లో మీతోపాటూ ప్రయాణం చేసినట్టు చెప్పమని నన్ను అడిగేసరికి నాకు మొదట అర్థం కాలేదు. ఇంత కథ వెనుక వుందని నేను అనుకోలేదు" అన్నాడు రామలింగం.

అవతారస్వామి, అమితాబ్‌బచ్చన్ దూరంగా సిగరెట్ కాల్చుకుంటూ మాట్లాడుకుంటున్నారు.

"ఒక కొడుకు చిన్నప్పుడే పోయాడు. రెండో కొడుకుని ఇక జీవితంలో కలుసుకోలేనేమో అనుకున్నాను. తీరా కలుసుకున్నాక -వాడు అనుక్షణం ప్రమాదంలో ఇరుక్కుంటున్నాడని ప్రాణం తల్లడిల్లిపోయేది. మొత్తానికి సాధించాడు" అంది శారదమ్మ.

"రంగాని లాకప్‌లోంచి ఎప్పుడు వదిలేస్తారు?"

రంగాకీ తెలుసు. మానుంచే పోలీస్‌స్టేషన్‌లో వున్న నరసింహానికి ఫోన్ చేయించాము. ముందు అప్రూవర్‌గా మారినా, తరువాత మనసు మార్చుకుని నరసింహానికి అసలు విషయమంతా చెప్పేస్తాడేమో అని భయపడి వాడిని ఇంతకాలం లాకప్‌లోనే వుంచాం. మాకు సాయం చేశాడు కాబట్టి చిన్న శిక్షతో వాడు తప్పించుకోవచ్చు....”

పోలీసు అధికారి తాగిన టీ కప్పు బల్లమీద పెడుతూ “అసలు ఏం సాధిద్దామని, నువ్వొక్కడివీ ఇంతపనికి పూనుకున్నావు మురళీ? నరసింహం ద్వారా ఆ రహస్యం బైట పెట్టించావనుకో, ఏం చేసేవాడివి ఆ తరువాత?”

“చంపేసేవాడిని!” కామ్‌గా అన్నాడు మురళి..........“హరికృష్ణ  రూపంలోనే బెదిరించి ఆస్థంతా అమ్మ పేరిట వ్రాయించి, ఆ తరువాత చంపేసేవాడిని, ఆ తరువాత నవ్వుతూ ఉరికంబం ఎక్కేవాడిని!!! కోర్టులో శిక్ష వేయటానికి ఆధారాలు కావాలి. నేను చంపటానికి అఖ్ఖర్లేదు”

“అంతమాట అనకు మురళీ ! అలా చేస్తే నీకూ ఆ నరసింహం తేడా ఏముంది?”

మురళి లేచి తల్లి కూర్చున్న కుర్చీ వెనగ్గా వచ్చి ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

అతడి కంఠస్వరం మంద్రంగా పలికింది. “ఆప్యాయంగా తన కొడుకుల్ని ఆడించవలసిన ఈ చేతులు పన్నెండు సంవత్సరాలు జైల్లో రాళ్ళని కొట్టాయండీ. చేయని నేరానికి ఈ చేతివేళ్ళు కటకటాల్ని పట్టుకునీ పట్టుకునీ రాటు తేలిపోయాయి. వీటికిప్పుడు ఏ న్యాయస్థానం సమాధానం చెపుతుంది?.....నిజమే, నరసింహం వెనుక ఏదో పెద్ద రహస్యం మరింకొకటి వున్నదన్న అనుమానం రాకపోయి వుంటే - ఈ పోలీసులు నాకు సాయం చేసేవారు కాదు. నా శిక్ష నే నొక్కణ్ణే తీర్చుకోవలసి వచ్చేది.”

“నీ మనసులో ఇంత ఆలోచన వుందని తెలిస్తే నేనసలు దీనికి వప్పుకొనేదాన్నే కాదురా మురళీ!” అంది శారదమ్మ.

మురళి రాధని చూస్తూ అన్నాడు--“నా మనసు ఒకందుకే బాధపడుతుందమ్మా! చిన్నప్పుడే చచ్చిపోయిన అన్నయ్య పేరుని మాటిమాటికీ వాడుకున్నాను. రాధని చాలా ఇరకాటంలో పెట్టాను. ఇద్దరు కృష్ణులు లేరని ముందే తెలిసినా, తండ్రి ముందు ఇలా నటించటం..... ఎంత కాదనకున్నా కూతురికి చాలా కష్టమైన పనే! ఈ కథలో అందరికన్నా నిబ్బరంగా తన పాత్ర నిర్వహించిన ఘనత రాధకి దక్కుతుంది. కేవలం నామాటలు నమ్మి -- తండ్రి నిజంగా అటువంటి వాడా కాదా అని తెలుసుకోవటం కోసం ఇన్ని పనులకీ వప్పుకుంది. ఎక్కడా తొణక్కుండా ఈ పన్లన్నీ నిర్వ ర్తించింది”

అప్పటివరకూ మాట్లాడకుండా తలదించుకునే వున్న రాధ ఆ మాటలకి కుర్చీలోంచి లేచి నెమ్మదిగా లోపలికి వెళ్ళిపోయింది. పొగడ్తవల్ల వచ్చిన సిగ్గుతోనో -- చేసిన పనివల్ల తండ్రికి

అందరూ ఆమెవైపే చూస్తున్నారు.

మరణించిన తండ్రి కోసం మురళి తీసుకున్న రిస్కుకన్నా బ్రతికున్న తండ్రిని ఉరికంబం ఎక్కించటానికి ఆమె చేసిన త్యాగం గొప్పదని అక్కడున్న అందరికీ తెలుసు.

*** అయిపోయింది***